RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in








సంపుటి -13 సంచిక - 449 | 14 శుక్రవారం ఆగస్టు 2026 | ఎడిటర్: బట్టు లక్ష్మీ నారాయణ | పేజీలు - 6 వెల రూ 5 /--


## ఆ స్థలాలు ఎక్కడికీ పోవు..

# నేను హామీ ఇస్తున్నా

### : సీఎం రేవంత్ రెడ్డి



రాష్ట్రంలో నిషేధిత జాబితాలో (22ఏ) చేర్చిన భూముల విషయంలో హక్కుదారులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. కోర్టు కేసుల కారణంగా మొత్తం సర్వే నంబర్‌ను నిషేధిత జాబితాలో చేర్చిన సందర్భాల్లో, వివాదంలో లేని భూములకు బై-నంబర్లు కేటాయించి సమస్యను పరిష్కరిస్తామని ఆయన స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ కాలనీలో కోర్ అర్బన్ (జఖ=జు) ప్రాంత పరిధిలో నిర్మించనున్న 'ఇందిరమ్మ ఇండ్లు (టవర్స్)' నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి ఆయన భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 22ఏ భూముల సమస్యపై కీలక హామీ ఇచ్చారు. "ఏదైనా కారణంగా మీ భూమి 22ఏ జాబితాలోకి చేరితే, కొనుగోలు చేసిన హక్కుదారుల స్థలాలు ఎక్కడికీ పోవు. నేను హామీ ఇస్తున్నా. కోర్టు కేసుల్లో ఉన్న కొంత భూమి కోసం మొత్తం సర్వే నంబర్‌ను నిషేధిత జాబితాలో పెట్టారు. ఆ వివాదాస్పద భూమిని పక్కనపెట్టి, మిగతా వాటికి బై-నంబర్లు ఇచ్చి రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పిస్తాం" అని స్పష్టం చేశారు. కూకట్‌పల్లిలో 11 ఎకరాల అత్యంత విలువైన స్థలంలో పేదల కోసం ఇందిరమ్మ టవర్స్ నిర్మించడం గొప్ప సంకల్పమని సీఎం అన్నారు. నగరంలో నిరుపేదలు ఎక్కడ నివసిస్తుంటే అక్కడే వారికి ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నది తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ ఇళ్ల నిర్మాణానికి అయ్యే వ్యయంలో లబ్ధిదారులు ఐదారు లక్షలు భరిస్తే, నిర్మాణ నాణ్యతను పర్యవేక్షించే హక్కు కూడా వారికి ఉంటుందన్నారు. పేదలపై భారం తగ్గించేందుకు ఈ ఇళ్లకు రిజిస్ట్రేషన్ ఛార్జీలను కూడా రద్దు చేయాలని వేదికపైనే మంత్రులకు సూచించారు. మొదటి విడతలో కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, మేడ్చల్, ఎల్బీనగర్ వంటి వలస కార్మికులు అధికంగా ఉండే ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణం చేపడుతున్నట్లు వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ, గత ప్రభుత్వంలోని ఏ పథకాన్నీ ఆపలేదని, అదనంగా ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500కే గ్యాస్ సిలిండర్, మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం వంటి పథకాలతో పేదలకు అండగా నిలుస్తున్నామన్నారు. రెండేళ్లలోనే 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని గుర్తు చేశారు. కూకట్‌పల్లి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని, రోడ్లు, ఫ్లైఓవర్లు, చెరువుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని మంత్రి శ్రీధర్ బాబుకు సూచించారు. విధ్వంసమైన తెలంగాణను వికాసం వైపు నడిపించడానికి తాను రోజుకు 18 గంటలు పనిచేస్తున్నానని, ప్రజలు తనను ఆశీర్వదించాలని కోరారు.

## శ్రీరామకుంట వైకుంఠధామాన్ని ఆహ్లాదకరమైన

# పార్కు తరహాలో తీర్చిదిద్దుతున్నాం

### : హరీశ్ రావు



సిద్ధిపేట శ్రీరామకుంట వైకుంఠధామాన్ని సరికొత్త రీతిలో ఒక ఆహ్లాదకరమైన పార్కు తరహాలో తీర్చిదిద్దుతున్నామని మాజీ మంత్రి, స్థానిక బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు తెలిపారు. సిద్ధిపేట పట్టణ పరిధిలోని శ్రీరామకుంట శ్మశానవాటికలో సాగుతున్న సుందరీకరణ పనులను ఆయన ఈరోజు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనుల తీరుపై సంతృప్తి వ్యక్తం చేసిన ఆయన... మిగిలిన పెండింగ్ పనులను వేగవంతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. శ్మశానవాటిక ప్రాంగణంలో పచ్చదనం పెంచేలా మరిన్ని మొక్కలు నాటాలని హరీశ్ సూచించారు. ప్రజల రాకపోకలకు వీలుగా సీసీ రోడ్లు, భద్రత కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో దహన సంస్కారాల కోసం వచ్చే ప్రజలు వెలుతురు లేక ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా... వెంటనే సరైన లైటింగ్ సౌకర్యాన్ని అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. వీటితో పాటు టాయిలెట్లకు తక్షణమే మరమ్మతులు చేపట్టి శుభ్రత ఉండేలా చూడాలన్నారు. పర్యావరణహిత పద్ధతిలో బయోగ్యాస్ ద్వారా దహన సంస్కారాలు నిర్వహించేలా చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను కోరారు.

# మీరు చేయకపోతే మేమే చేస్తాం

### : ప్యాకేజ్డ్ ఫుడ్ అంశంలో కేంద్రంపై సుప్రీంకోర్టు ఆగ్రహం



అధిక మొత్తంలో ఉప్పు, చక్కెర, కొవ్వు ఉండే ప్యాకేజ్డ్ ఆహార పదార్థాల ప్యాకెట్లపై ముందు భాగంలో హెచ్చరిక లేబుళ్లను తప్పనిసరి చేయడంలో జరుగుతున్న జాప్యంపై సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వం, ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ)పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. "మీరు చేయలేకపోతే, మేమే అమలు చేసేలా చూస్తాం" అంటూ గట్టి హెచ్చరిక జారీ చేసింది. ఈ విషయంలో తుది నిర్ణయం తెలియజేయడానికి కేంద్రానికి రెండు వారాల గడువును మంజూరు చేసింది. జస్టిస్ జె.బి. పార్దీవాలా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం గురువారం ఈ అంశంపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విచారించింది. ఇది ప్రజల, ముఖ్యంగా చిన్నారుల ఆరోగ్యానికి సంబంధించిన కీలకమైన అంశమని, కార్పొరేట్ సంస్థల ఒత్తిడికి తలొగ్గి నిర్ణయాలు తీసుకోవద్దని ధర్మాసనం స్పష్టం చేసింది. "తయారీదారులు తమ వ్యాపారం దెబ్బతింటుందన్న ఉద్దేశంతో ఈ లేబుళ్లను వ్యతిరేకించవచ్చు, కానీ తాము కొనుగోలు చేసే వస్తువులో ఏయే పదార్థాలు ఉన్నాయో తెలుసుకునే హక్కు వినియోగదారులకు ఉంటుంది" అని కోర్టు వ్యాఖ్యానించింది.

అంతర్జాతీయ ప్రమాణాలను పాటిస్తే నమ్‌కీన్ వంటి భారతీయ సంప్రదాయ ఆహార పదార్థాలపై కూడా 'రెడ్ మార్క్' పడుతుందని కేంద్రం తరపున అదనపు సొలిసిటర్ జనరల్ బ్రిజేందర్ చాహర్ వాదించారు. అయితే, ఈ వాదనను కోర్టు తోసిపుచ్చింది. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటం ప్రభుత్వం బాధ్యత కాదా అని ప్రశ్నించింది. రెండు వారాల్లోగా ప్రభుత్వం తన తుది నిర్ణయాన్ని తెలియజేయాలని, లేనిపక్షంలో తదుపరి విచారణలో తామే తగిన ఉత్తర్వులు వెలువరిస్తామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

## ఏనుగులు జీవవైవిధ్యానికి కాపలాదారులు..

# వాటి సంరక్షణ ప్రజా ఉద్యమంగా మారాలి

### : పవన్ కల్యాణ్



విశాఖపట్నంలో నిర్వహించిన ప్రపంచ ఏనుగుల దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, వన్యప్రాణుల సంరక్షణ, మానవ-ఏనుగుల సంఘర్షణ నివారణపై కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా ఏనుగుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టడం వల్ల, 2014 నుంచి ఏనుగుల రిజర్వుల సంఖ్య 26 నుంచి 33కు పెరిగిందని, అలాగే 150 ఏనుగుల కారిడార్లను గుర్తించి రక్షణ కల్పిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో 132 నుంచి 142 వరకు అడవి ఏనుగులు ఉన్నాయని వెల్లడించారు. పలమనేరు, పార్వతీపురం మన్యం ప్రాంతాల్లో ప్రధాన సమస్యగా మారిన మానవ-ఏనుగుల సంఘర్షణను అరికట్టేందుకు కర్ణాటక ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా కర్ణాటక నుంచి నాలుగు కుంకీ ఏనుగులను తీసుకువచ్చి ముసలివాగు వద్ద ప్రత్యేక శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, వీటి సహాయంతో 50కి పైగా ఆపరేషన్లు నిర్వహించి మానవ మరణాలను 70 శాతం వరకు తగ్గించగలిగామని స్పష్టం చేశారు. అంతేకాకుండా, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'హనుమాన్' కార్యక్రమంలో భాగంగా ర్యాపిడ్ రెస్పాన్స్ వాహనాలతో పాటు ఏడు ప్రత్యేక వన్యప్రాణుల అంబులెన్స్‌లను అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. వీటి ద్వారా ఇప్పటివరకు 200కు పైగా వన్యప్రాణులను రక్షించడంతో పాటు 30కి పైగా ప్రత్యేక ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఏనుగుల సంరక్షణ అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రజలందరి భాగస్వామ్యంతో ఒక ప్రజా ఉద్యమంగా మారాలని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు.

# వాయుగుండంగా మారిన అల్పపీడనం రాబోయే 3 రోజులు వర్షాలు



బంగాళాఖాతంలో అల్పపీడనం వాయవ్య దిశగా కదిలి గురువారం వాయుగుండంగా పశ్చిమబెంగాల్ తీరప్రాంతం వద్ద కేంద్రీకృతమై ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాబోయే 24 గంటల్లో గంగా పరీవాహక పశ్చిమ బెంగాల్ జార్ఖండ్ మీదుగా దాదాపు వాయవ్య దిశగా కదిలే అవకాశం ఉన్నదని అధికారులు పేర్కొన్నారు. దీని ప్రభావంతో వచ్చే మూడు రోజులు వర్షాలు కురుస్తాయని తెలిపారు. శుక్ర, శనివారం రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అకడకడ కురిసే అవకాశం ఉన్నది.

# విదేశాంగ విధానమంటే ఆలింగనాలు కాదు

### : మోదీపై రాహుల్ గాంధీ విమర్శలు




ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అనుసరిస్తున్న విదేశాంగ విధానంపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రపంచ దేశాల అధినేతలను ఆలింగనం చేసుకోవడం, వ్యక్తిగత స్నేహాలను ప్రదర్శించడం విదేశాంగ విధానం అనిపించుకోదని, దేశ ప్రయోజనాలను కాపాడటమే అసలైన దౌత్యమని ఆయన స్పష్టం చేశారు. గురువారం ఢిల్లీలో జరిగిన 'రచనాత్మక్ కాంగ్రెస్' జాతీయ సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. విదేశాంగ విధానమంటే విదేశీ నేతలను కౌగిలించుకోవడమన్న ఆలోచన మోదీకి ఎక్కడి నుంచి వచ్చిందో అర్థం కావడం లేదని రాహుల్ గాంధీ ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా తన వాదనను వివరించేందుకు వేదికపై ఉన్న రచనాత్మక్ కాంగ్రెస్ చీఫ్ సందీప్ దీక్షిత్‌ను ఆయన ఆలింగనం చేసుకున్నారు. తన నాయనమ్మ, మాజీ ప్రధాని ఇందిరా గాంధీతో కలిసి బాల్యంలో అమెరికా వెళ్లిన సందర్భాన్ని గుర్తుచేసుకుంటూ, దేశాధినేతల అధికారిక పర్యటనలు వ్యక్తిగత పర్యటనలు వంటివి కావని ఆయన పేర్కొన్నారు. ఇరాన్, అమెరికా, రష్యాలతో భారత్‌కు సుహృద్భావ సంబంధాలు ఉన్నప్పటికీ, ఇరాన్ వివాదంలో మధ్యవర్తిత్వం వహించే అరుదైన అవకాశాన్ని భారత్ కోల్పోయిందని రాహుల్ గాంధీ ఆరోపించారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని కొన్ని సరిహద్దు ప్రాంతాల్లో భారత సైన్యం పెట్రోలింగ్‌ను చైనా అడ్డుకుంటోందని, గల్వాన్ ఘర్షణల విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరి దేశాన్ని బలహీనపరిచిందని ఆయన విమర్శించారు.

బీజేపీ, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్)లను ఒక 'జోకర్ల బృందం'గా అభివర్ణించిన రాహుల్ గాంధీ, ఆ సంస్థలు దేశంపై ఏకపక్ష రాజకీయ వ్యవస్థను రుద్దేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. ఇదే కార్యక్రమంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ, పార్లమెంటులో ప్రతిపక్షాల గొంతును ప్రభుత్వం విస్మరిస్తోందని మండిపడ్డారు.

RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
14 శుక్రవారం ఆగస్టు 2026

# ప్రభుత్వ పాఠశాలలకు మరింత అభివృద్ధి చేస్తా...

## విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఖ= నాగరాజు గారు...

హైద్రాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్ హన్మకొండ
గ్రేటర్ వరంగల్ 65వ డివిజన్లోని ఎల్లాపూర్ గ్రామంలోని జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు వర్ధన్నపేట ఎమ్మెల్యే,విశ్రాంత ఐపీఎస్ అధికారి శ్రీ కేఆర్ నాగరాజు గారు గురువారం క్రీడా దుస్తులు పంపిణీ చేశారు.విద్యార్థులు,ఉపాధ్యాయులు ఎమ్మెల్యే గారికి ఘన స్వాగతం పలికారు.అనంతరం పాఠశాల ప్రాంగణంలో మొక్కను నాటారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ...ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు చేరాలని కోరారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులతో కూడిన విద్యను అందించడమే ద్యేయంగా కృషి చేస్తున్నామని అన్నారు. ప్రతి విద్యార్థిని బాగా చదువుకొని దేశానికి వెన్నెముక కావాలని ఉద్దేశించారు.విద్యార్థులు మీ లక్ష్యాలను చేరుకునేందుకు ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందని,మీరంతా బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు.స్థానికంగా ఉన్న నాయకులు సైతం పాఠశాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో 65వ డివిజన్ అధ్యక్షులు సునీల్, ఎల్లాపూర్ గ్రామ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి,ఆత్మకూరు మార్కెట్ వైస్ చైర్మన్ తిరుపతి,సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు రాకేష్ రెడ్డి,మండల అధ్యక్షులు అశోక్,మాజీ మండల అధ్యక్షులు మహేందర్ రెడ్డి,అమ్మ ఆదర్శ పాఠశాల



చైర్మన్ అరుణ, భిక్షపతి,జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్ రెడ్డి,66వ డివిజన్ అధ్యక్షులు గొర్రె కిరణ్,మహిళా ఉపాధ్యక్షురాలు స్వాతి,మాజీ ఎంపిటిసి సుదర్శన్,సీనియర్ నాయకులు ప్రకాష్,మధుసూదన్ రెడ్డి,కుమారస్వామి,అశోక్,డివిజన్ ముఖ్య నాయకులు,నాయకులు,ఉపాధ్యాయులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సీతారాంపురం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థాన అభివృద్ధికి దాతల సహకారం

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి యాదాద్రి భువనగిరి । 13-08-2026, గురువారం గుండాల మండలం సీతారాంపురం గ్రామంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థాన అభివృద్ధి మరియు ధ్వజస్తంభ నిర్మాణ కార్యక్రమాలకు దాతలు ముందుకు వచ్చి తమ వంతు సహాయ సహకారాలు అందించడం ఎంతో అభినందనీయమని దేవస్థాన కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పేర్కొన్నారు. ధ్వజస్తంభ దాతగా శ్రీ జాలిగామ రమా సాగర్ రావు గారు ముందుకు వచ్చి సహకారం అందించడం పట్ల దేవస్థాన కమిటీ మరియు గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. అలాగే, ఆలయ అభివృద్ధి కార్యక్రమాలకు మొదటి దాతగా శ్రీ మలిపెద్ది లక్ష్మీ నర్సిరెడ్డి (రాజారాం) గారు ₹1,00,116/- (లక్షా నూట పదహారు రూపాయలు) ,చేగురీ రాధ పెద్దాపురం 20116/విరాళంగా అందించి, ఆలయ అభివృద్ధి పట్ల తన గొప్ప సేవాభావాన్ని చాటుకున్నారు. సీతారామచంద్రస్వామి వారి ఆలయ అభివృద్ధి కోసం ఇంతటి ఉదారమైన సహకారం అందించిన జాలిగామ రమా సాగర్ రావు, మరియు మలిపెద్ది లక్ష్మీ నర్సిరెడ్డి (రాజారాం) చెగురి రాధ పెద్దాపురం, కి దేవస్థాన కమిటీ తరఫున, సీతారాంపురం గ్రామ ప్రజల తరఫున హృదయపూర్వక ప్రత్యేక ధన్యవాదాలు మరియు కృతజ్ఞతలు తెలియజేశారు. మీ సేవా భావం మరెందరికో స్ఫూర్తిగా నిలవాలని, శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆశీస్సులు మీ కుటుంబాలపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటున్నాము.అని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ జాలిగామ చలపతిరావు, వైస్ చైర్మన్ సోమిరెడ్డి, గ్రామ సర్పంచ్ కాళీ పద్మ వెంకన్న, ప్రధాన కార్యదర్శి స్వామి, సహాయ కార్యదర్శులు జాలిగామ రామారావు, మల్లారెడ్డి, ఉపేందర్, మల్లయ్య, కోశాధికారి మనోహర్, చెగురి పెద్దాపురం ,మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.





# సుబేదారి ఆర్ట్స్ కాలేజీలో నూతన కాకతీయ క్యాంటీన్ ప్రారంభం..

హైద్రాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్ హన్మకొండ
విద్యార్థులు, సిబ్బందికి నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందించాలి: ఎమ్మెల్యే నాయిని..హనుమకొండ: సుబేదారి ఆర్ట్స్ కాలేజీలో నూతనంగా ఏర్పాటు చేసిన కాకతీయ క్యాంటీన్‌ను వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి గారు గురువారం ప్రారంభించారు.ఈ సందర్భంగా క్యాంటీన్ నిర్వాహకులు శ్రీ దూలం క్రాంతికుమార్ గౌడ్, శ్రీ సుదర్శన్లను ఎమ్మెల్యే అభినందించారు. విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందికి నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని అందిస్తూ క్యాంటీన్‌ను విజయవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు.క్యాంటీన్ అందుబాటులోకి రావడంతో కళాశాల విద్యార్థులు, సిబ్బందికి మెరుగైన ఆహార సదుపాయం అందుబాటులోకి వచ్చిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జ్యోతి, లా కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. సుదర్శన్, పీజీ కాలేజ్ ప్రిన్సిపల్ నిర్మల, నాన్-టీచింగ్ చీ+టా అధ్యక్షుడు, సుబేదారి యూనిట్ శ్రీ రాజు నాయక్, ఆర్ట్స్ కాలేజ్ టీచింగ్



ఫ్యాకల్టీ క్లబ్ చైర్మన్ డాక్టర్ భిక్షపతి, ఫ్యాకల్టీ సభ్యులు, నాన్-టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# పోలీసు సేవకు గౌరవ నివాళి

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 13:-
మంచాల: విధి నిర్వహణలో సేవలందించిన కానిస్టేబుల్ జరుపుల సాయికుమార్ మృతికి పోలీసు శాఖ ఘనంగా నివాళులర్పించింది. ఎల్‌బీ నగర్ ఏసీపీ కార్యాలయంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సాయికుమార్ నిన్న మృతి చెందగా, ఆయన స్వగ్రామమైన మంచాల మండలం బండలేమూరు గ్రామంలోని అజ్ఞాన తండాలో గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. ఇబ్రహీంపట్నం ఏసీపీ కె.వి.పి. రాజు ఆధ్వర్యంలో మంచాల పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఏ. మధు, ఎస్‌ఐ ఈ. వంశీతో పాటు పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది అంత్యక్రియలకు హాజరై కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.సాయికుమార్‌కు గౌరవపూర్వక తుది వీడ్కోలు పలుకుతూ ఏసీపీ రాజు, సీఐ మధు, ఎస్‌ఐ వంశీతో పాటు పోలీసు సిబ్బంది పాడెను స్వయంగా మోశారు.సహోద్యోగి మృతితో పోలీసు సిబ్బంది భావోద్వేగానికి గురయ్యారు. విధి నిర్వహణలో సాయికుమార్ అందించిన సేవలను అధికారులు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఆయన కుటుంబానికి పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని అధికారులు భరోసా ఇచ్చారు.అంత్యక్రియలకు హాజరైన కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామ ప్రజల కోసం మంచాల పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆధ్వర్యంలో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




# సమూహ రాష్ట్ర సభలను విజయవంతం చేయండి

హైద్రాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్ హన్మకొండ
2023 ఆగస్టు 12 న ప్రారంభమైన సమూహ, సెక్యులర్ రైటర్స్ ఫోరం ఈ 2026 ఆగస్టు 16 న ఖమ్మం లో రెండవ మహాసభ నిర్వహించుకోబోతున్నది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని వరంగల్ రచయితలు, ప్రజాస్వామికవాదులు 13 ఆగస్టు సాయత్రం హన్మకొండలోని అంబేద్కర్ విగ్రహం దగ్గర సమావేశమై సభల పోస్టర్ ను, కరపత్రాన్ని
గంట రామిరెడ్డి, పి. చంద్, జి. గంగాధర్, కాత్యాయని విద్మహే, పురుషోత్తం మొదలగువారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యం - సాంస్కృతిక సంభాషణ అనే అంశం మీద జరిగే ఈ సదస్సులో ప్రసేన్ ప్రారంభోపన్యాసం చేస్తారు. ప్రజాస్వామ్యం - పౌర సత్వ సమస్య సవాళ్లు అనే అంశం మీద జహ ఆరా, సాహిత్యంలో బహుళ అస్థిఅత్వాలు అనే అంశం మీద జిలుకర శ్రీనివాస్ ప్రసంగిస్తారు. ముగింపు సమావేశంలో వర్తమాన సామాజిక సందర్భం సమూహ ఆచరణ అనే అంశంపై ఆర్. సీతారాం మాట్లాడతారు. మెట్టు రవీందర్, పసునూరి రవీందర్,
సుంకిరెడ్డి నారాయణ రెడ్డి వివిధ సమావేశాలకు అధ్యక్షత వహిస్తారు. దాదహయత్, మెర్సీమార్గరేట్,రూపరుక్మిని,విద్యాసాగర్, ఐతీ. గోపీ నాథ్, సిద్ధంకి యాదగిరి,శజహాన,తోట సుభాషిణి, షూకూర్, గుడిపల్లి నిరంజన్,ధరణికోట రమేశ్ కుమార్,పొతగాని సత్యనారాయణ, ఫణిమాదవి కన్నోజు, నాలేశ్వరం శంకర్, భూపతి వెంకటేశ్వర్లు, ఇబ్రహీం నిర్గుణ్, జగన్ రెడ్డి మొదలైన రచయితలు తమ అ
భిప్రాయాలు పంచుకుంటారు.ప్రజాస్వామ్య పరిరక్షణ లక్ష్యంగా, న్యాయం,స్వేచ్ఛ, సమానత్వం,సౌభ్రాతృత్వం అనే విలువలతో వెలిగే భారతదేశాన్ని కలగంటూ రచన ఆచరణ గా జరిగే సమూహ రెండవ రాష్ట్ర మహాసభలకు వరంగల్ రచయితలు, కళా కారులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరుతున్నాము.
పోస్టర్ , కరపత్ర ఆవిష్కరణలో మెట్టు రవిందర్, బిల్ల మహేందర్, సంపత్, సింగరాజు రమాదేవి, జి.



మహేందర్, డా. బండారు సుజాత, అనిత,రామబ్రహ్మం, పిట్ట సాంబయ్య, సంజీవరెడ్డి, కళా,అల్లం మల్లయ్య, గోవింద రావు, పురుషోత్తం, vilasini, సుజాత, కొమరయ్య, ఎతీ. రాములు, సాగంటి మంజుల, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమూహ
కాత్యాయనీ, మేట్టు రవీందర్

# అంబేద్కర్ సంఘం మాజీ అధ్యక్షులు శంకరయ్య కుటుంబానికి 50కేజిల బియ్యం తోపాటు నగదు అందజేసిన అంబేద్కర్ సంఘం నాయకులు





( హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి ఆగస్టు 13:)
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ మహేశ్వరం మండల కేంద్రంలోని పెద్దపులి నాగారం గ్రామంలో మాజీ అంబేద్కర్ సంఘం అధ్యక్షులు దప్పు శంకరయ్య అనారోగ్య కారణాలవల్ల స్వర్గస్తులు అయ్యారు ఎన్నో సంవత్సరాలుగా గ్రామంలో సేవలందించిన దప్పు శంకరయ్య కుటుంబానికి అంబేద్కర్ సంఘం తరఫున అంబేద్కర్ సంఘం అధ్యక్షులు బూర్గుల నవీన్ కుమార్, దార ఉపాధ్యక్షులు ధర సిద్దు ఆధ్వర్యంలో.. 50 కిలోల బియ్యంతో పాటు నగదు అందజేయడం జరిగింది అంబేద్కర్ సంఘ నాయకులు మాట్లాడుతూ.. మంచి నాయకుడిని కోల్పోయామని వారి ఆత్మ శాంతి చేకూరాలని అన్నారు.. ఈ యొక్క కార్యక్రమంలో తోట్ల శ్రీకాంత్ కావలి కుమార్ కావలి ఆనంద్ తదితరులు యొక్క కార్యక్రమంలో పాల్గొన్నట్టు అంబేద్కర్ సంఘం అధ్యక్షులు నవీన్ కుమార్ తెలియజేశారు

# హనుమకొండలో ఘనంగా 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ

**బిజెపి హనుమకొండ జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో వేయిస్తంభాల గుడి నుండి అంబేద్కర్ విగ్రహం వరకు సాగిన ర్యాలీ.**

**ముఖ్యఅతిథిగా హాజరైన టీచర్స్ ఎమ్మెల్సీ శ్రీ మల్కా కొమరయ్య గారు.**

**వందేమాతరం, భారత్ మాతకి జై నినాదాలతో హోరెత్తిన నగరం.**

**వికసిత్ భారత్ సాధించడమే మనందరి సమష్టి సంకల్పం దేశభక్తి స్ఫూర్తిని చాటుదాం**

**- ఎమ్మెల్సీ మాల్క కొమరయ్య**

హైద్రాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్ హన్మకొండ
'వికసిత్ భారత్' సాధించడమే మనందరి సమష్టి సంకల్పం దేశభక్తి స్ఫూర్తిని చాటుతూ 'హర్ ఘర్ తిరంగా' అభియాన్ లో భాగంగా గురువారం సాయంత్రం హనుమకొండ వేయిస్తంభాల గుడి నుండి అంబేద్కర్ విగ్రహం వరకు భారీ తిరంగా ర్యాలీ అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించబడింది.
ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శ్రీ మల్క కొమరయ్య గారు ముఖ్య అతిథిగా హాజరైయ్యారు.
విద్యార్థులు, యువత మరియు హనుమకొండ ప్రజలు విశేష సంఖ్యలో పాల్గొని మువ్వన్నెల జెండాలను గర్వంగా చేతబూని ర్యాలీగా సాగారు.
ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... మనం త్రివర్ణ పతాకాన్ని గర్వంగా చేతబట్టి ముందుకు సాగుతున్న ప్రతి క్షణం, దేశ స్వాతంత్ర్య సమరయోధులు మరియు వీర జవాన్ల అపార త్యాగాలను స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. వారి ధైర్యం, అంకితభావం, దేశసేవ వల్లనే నేడు ప్రగతి పథంలో పయనిస్తున్న నవ భారతదేశం మన ముందు నిలిచిందని పేర్కొన్నారు.గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ గారి నాయకత్వంలో భారత్ నూతన ఆత్మవిశ్వాసంతో, మరింత బలంగా ముందుకు సాగుతోందని కొనియాడారు. నేడు భారతదేశం వికసిత్ భారత్ లక్ష్యం దిశగా నిరంతరం పురోగమిస్తోందని, త్రివర్ణ పతాకాన్ని గర్వంతో చేతబట్టడమే కాకుండా దాని స్ఫూర్తిని ప్రతీ ఒక్కరూ నిత్యం హృదయాల్లో నిలుపుకోవాలని ఆకాంక్షించారు. మరింత శక్తివంతమైన, సుసంపన్నమైన, ఆత్మనిర్భర భారతాన్ని నిర్మిస్తూ 'వికసిత్ భారత్' సాధించడమే మనందరి సమష్టి సంకల్పం కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు శ్రీమతి రావు




పద్మ రెడ్డి, డా. పగడాల కాళీప్రసాద్ రావు, గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, మాజీ మేయర్ డా. టి. రాజేశ్వర్ రావు, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, డా. పెసరు విజయ్ చందర్ రెడ్డి, పులి సర్రోతం రెడ్డి, మాజీ కార్పొరేటర్లు చాడ స్వాతి శ్రీనివాస్ రెడ్డి, రావుల కోమల కిషన్, గుజ్జుల వసంత మహేందర్ రెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శులు ఆర్. పి. జయంత్ లాల్, దేవనూరి మేఘనాథ్, జిల్లా నాయకులు, వివిధ డివిజన్, మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
14 శుక్రవారం ఆగస్టు 2026

# సైబర్ మోసాలపై అప్రమత్తతే రక్షణ







హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 13:-
నందిగామ పోలీస్ స్టేషన్ పరిధిలోని మేకగూడ గ్రామంలో ఉన్న నాట్కో ఫార్మా కంపెనీ ఉద్యోగులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు ఉద్యోగులకు ఆన్‌లైన్ మోసాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకులను తెరవకూడదని సూచించారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు, పాస్‌వర్డ్లు, వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులకు వెల్లడించరాదని తెలిపారు. సైబర్ నేరగాళ్లు వివిధ రకాల మోసపూరిత పద్ధతులతో ప్రజలను బలిచేస్తున్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పొరపాటున సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో నందిగామ ఎస్‌హెచ్‌ఓ వీరబాబు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, నాట్కో ఫార్మా ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌ఓ మాట్లాడుతూ అప్రమత్తతతోనే సైబర్ నేరాలను అరికట్టవచ్చని పేర్కొన్నారు.

## ఆమన్‌గల్‌లో ప్రజా భద్రతపై పోలీసుల అవగాహన



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 13:-
ఆమన్‌గల్ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్, కమిషనర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ప్రజా భద్రత, నేరాల నియంత్రణ, సైబర్ మోసాల నివారణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ తదితర అంశాలపై పోలీసు అధికారులు కౌన్సిల్ సభ్యులకు అవగాహన కల్పించారు.ఆమన్‌గల్ ఎస్‌హెచ్‌ఓ ఎస్. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పట్టణంలోని రద్దీ ప్రాంతాలు, సమస్యాత్మక ప్రదేశాలను గుర్తించి అక్కడ సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రహదారి భద్రతకు ప్రాధాన్యతనిస్తూ వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రస్తుతం పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేయాలని, గుర్తుతెలియని లింకులు, ఫోన్ కాల్స్, సందేశాలకు స్పందించకుండా జాగ్రత్తలు తీసుకునేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ముఖ్యంగా ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.మహిళలు, బాలికల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, ఈవ్‌టీజింగ్‌ను అరికట్టేందుకు కఠిన చర్యలు చేపట్టాలని సమావేశంలో చర్చించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు.పోలీసు, మున్సిపల్ శాఖల మధ్య సమన్వయంతో ప్రజలకు మరింత సురక్షితమైన వాతావరణం కల్పించేందుకు చర్యలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. ఎమ్మెల్యే, మున్సిపల్ అధికారులు, కౌన్సిల్ సభ్యులు, పోలీసులు పాల్గొన్నారు.

## వాటర్ ట్యాంక్ పొంగుతున్నా పట్టించుకోరే..!




హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 13:-
ఎలిమినేడు: ఇబ్రహీంపట్నం మండలం ఎలిమినేడు గ్రామంలో మిషన్ భగీరథ తాగునీరు వృథాగా పోతుండటంపై గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామపంచాయతీ కార్యాలయం సమీపంలోని వాటర్ ట్యాంక్ నుంచి నీరు నిరంతరం పొంగిపొర్లుతూ రోడ్డుపైకి చేరుతోంది. దీంతో విలువైన తాగునీరు వృథా కావడంతో పాటు పరిసర ప్రాంతాల్లో నీరు నిలిచి అపరిశుభ్ర వాతావరణం ఏర్పడే పరిస్థితి నెలకొంది.గ్రామంలో తాగునీటి సరఫరా కోసం ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం ద్వారా నీటిని అందిస్తున్నప్పటికీ, సరైన పర్యవేక్షణ లేకపోవడంతో నీరు వృథా అవుతోందని స్థానికులు చెబుతున్నారు. ట్యాంక్ నుంచి నీరు ఓవర్‌ఫ్లో అవుతున్న విషయాన్ని సంబంధిత అధికారులు, గ్రామపంచాయతీ సిబ్బంది గమనించి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.ఇదిలా ఉండగా గ్రామంలోని కొన్ని ప్రాంతాల్లో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మరోవైపు అందుబాటులో ఉన్న నీరు ఇలా వృథా కావడం బాధాకరమని గ్రామస్తులు పేర్కొంటున్నారు. నీటి వృథాను అరికట్టేందుకు ట్యాంక్ నిర్వహణను పర్యవేక్షించడంతో పాటు లోపాలను వెంటనే సరిచేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు స్పందించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కోరుతున్నారు.

## అమెరికాలో హన్మకొండ జిల్లా యువకుడు మృతి



అమెరికాలో జరిగిన అగ్నిప్రమా దంలో తీవ్రంగా గాయపడ్డ హనుమ కొండ జిల్లా హసన్పర్తి మండలం గంటూర్పల్లికి చెందిన భరత్చం దర్రెడ్డి (29) మృతి చెందారు. జులై 25న జరిగిన ప్రమాదంలో 75 శాతం కాలిన గాయాలతో టంపా జనరల్ ఆస్పత్రిలో చేరిన ఆయన.. 16 రోజుల పాటు మృత్యువుతో పోరాడి ఆగస్టు 10న కన్నుమూశాడు. భరత్ ఉన్నత చదువుల కోసం మూడేళ్ల క్రితం అమెరికా వెళ్లాడు. ఫ్లోరిడా రాష్ట్రంలోని టంపాలో ఉన్నత విద్యను పూర్తి చేసి, అక్కడే ఉద్యోగం చేస్తున్నాడు. చదువు పూర్తయిన అనంతరం స్వగ్రామానికి వచ్చి వివాహం చేసుకుని తిరిగి అమెరికా వెళ్లాలని భావించాడు. ఇంతలోనే జరిగిన అగ్నిప్రమాదం కుటుంబంలో విషాదాన్ని నింపింది. తల్లిదండ్రులు కుమారు డిని కాపాడేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. వైద్యులు మెరుగైన చికిత్స అందించినప్పటికీ ఫలితం లేకపోయింది.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉచిత నోట్‌బుక్స్ పంపిణీ



హైదరాబాద్ ఎస్టేట్ చిట్యాల ప్రతినిధి మ్యాదరి సునీల్
చిట్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల విద్యాభివృద్ధిని ప్రోత్సహించడంతో పాటు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థులకు తోడ్పాటు అందించే ఉద్దేశంతో ఉచిత నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బుర్ర వెంకటేష్ గౌడ్ గారు, వార్డు మెంబర్ తౌటం నవీన్ గారు పాల్గొని విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేశారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి గారు మాట్లాడుతూ, విద్యార్థుల చదువుకు అవసరమైన నోట్‌బుక్స్‌ను ఉచితంగా అందించడం వల్ల పేద, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలపై పుస్తకాల కొనుగోలు భారం కొంతవరకు తగ్గుతుందని తెలిపారు. విద్యార్థులు తరగతి గదిలో అధ్యాపకులు బోధించే పాఠాలను క్రమబద్ధంగా నోట్ చేసుకోవడానికి, ముఖ్యమైన అంశాలను నమోదు చేసుకోవడానికి, అలాగే ఇంటి వద్ద పాఠాలను పునశ్చరణ చేసుకోవడానికి నోట్‌బుక్స్ ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.విద్యార్థులు అందిస్తున్న ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకొని క్రమశిక్షణతో, పట్టుదలతో చదివి ఉన్నత విద్యను అభ్యసించి, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆమె ఆకాంక్షించారు.
విద్యార్థుల విద్యాభివృద్ధికి అవసరమైన సహకారాన్ని అందించడం అభినందనీయమని, ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో చదువుపై మరింత ఆసక్తి మరియు ప్రోత్సాహాన్ని కలిగిస్తాయని కార్యక్రమంలో పాల్గొన్న వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు అమ్మాయి ఎస్. కళ్యాణి రెడ్డి విజయగాథ

### కష్టాలను దాటి »Mrs India Winner 2026'గా సత్తా చాటిన మోడల్





హైదరాబాద్ ఎస్టేట్ చిట్యాల ప్రతినిధి మ్యాదరి సునీల్
నెల్లూరు: జీవితంలో ఎన్ని కష్టాలు ఎదురైనా కలను వదులుకోకుండా ముందుకు సాగితే విజయం తప్పకుండా వరిస్తుందని నిరూపిస్తున్నారు నెల్లూరుకు చెందిన ఎస్. కళ్యాణి రెడ్డి. కుటుంబ కష్టాలు, అవకాశాల కొరత, ఎన్నో సవాళ్లను అధిగమిస్తూ యాక్టింగ్, మోడలింగ్ రంగాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు.
కళ్యాణి రెడ్డి చిన్ననాటి నుంచే ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నారు. తండ్రి లేకపోయినా తల్లి తన పిల్లల భవిష్యత్తు కోసం ఎన్నో కష్టాలు పడి, చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తూ కళ్యాణి రెడ్డి, ఆమె అన్నయ్యను పెంచారు. తల్లి అందించిన ధైర్యం, కుటుంబ సభ్యుల అండ కళ్యాణి జీవితానికి బలమైన పునాదిగా నిలిచాయి.
చిన్నప్పటి నుంచే యాక్టింగ్, మోడలింగ్ రంగాలపై ఆసక్తి పెంచుకున్న కళ్యాణి, తన కలను నిజం చేసుకోవాలనే లక్ష్యంతో యాక్టింగ్ ఫీల్డ్‌లోకి అడుగుపెట్టారు. అవకాశాల కోసం ఎన్నో ప్రయత్నాలు చేశారు. ఎన్నో సవాళ్లు, అనుభవాలు ఎదురైనా ఆశించిన స్థాయిలో అవకాశాలు లభించలేదు. అయినప్పటికీ ఆమె నిరాశ చెందకుండా మళ్లీ మోడలింగ్ రంగంపై దృష్టి సారించారు.
ఈ ప్రయాణంలో కళ్యాణి రెడ్డికి ఆమె హస్బెండ్ అందించిన ప్రోత్సాహం, అండ ఎంతో కీలకంగా మారింది. ఆయన సపోర్ట్‌తో పాటు తల్లి, అన్నయ్య ఇచ్చిన ప్రోత్సాహం కూడా ఆమెకు మరింత ధైర్యాన్ని ఇచ్చింది. కుటుంబ సభ్యుల నమ్మకంతో సోషల్ మీడియా వేదికగా తనలోని నటనా ప్రతిభను ప్రేక్షకులకు పరిచయం చేశారు.
ముఖ్యంగా యాక్టింగ్ రీల్స్ ద్వారా సోషల్ మీడియాలో తన ప్రతిభను చాటుతూ అభిమానులను, ఫాలోవర్లను సంపాదించుకున్నారు. సోషల్ మీడియా ద్వారా తన టాలెంట్‌ను నిరంతరం ప్రజలకు చేరువ చేస్తూ మోడలింగ్ రంగంలో తన ప్రయాణాన్ని మరింత వేగవంతం చేశారు.
ఇటీవల జరిగిన ఓ లిఇంటర్నేషనల్ ప్రోగ్రామ్‌లో పాల్గొని 'వీ=ూ ఇండియా విన్నర్ 2026'లిగా నిలవడం కళ్యాణి రెడ్డి జీవితంలో మరచిపోలేని విజయంగా నిలిచింది. ఈ విజయంతో ఆమె ప్రతిభకు మరింత గుర్తింపు లభించింది. ఈ ప్రయాణంలో వీ ఈవెంటేజ్ సిఈవో ప్రసాద్ అందించిన ప్రోత్సాహం, సహకారాన్ని ఆమె ప్రత్యేకంగా గుర్తుచేసుకుంటున్నారు.
అంతేకాకుండా ప్రస్తుతం గోవాలో జరగనున్న ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్‌కు ఫైనలిస్ట్‌గా ఎంపిక కావడం కళ్యాణి రెడ్డి విజయ ప్రయాణంలో మరో ముఖ్యమైన ముందడుగుగా చెప్పుకోవచ్చు. ఈ కార్యక్రమాన్ని కూడా వి ఈవెంటేజ్ సీఈవో ప్రసాద్ నిర్వహిస్తున్నారు.
తన విజయాల వెనుక తల్లి, అన్నయ్య, భర్త, ప్రసాద్ సార్, అభిమానులు, తనను నమ్మిన ప్రతి ఒక్కరి సహకారం ఉందని కళ్యాణి రెడ్డి చెబుతున్నారు. వారి ప్రోత్సాహాన్ని జీవితాంతం గుర్తుంచుకుంటానని, తనను ఆదరించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.
"పరిస్థితులు ఎలా ఉన్నా మన కలను వదులుకోకుండా నిరంతరం ప్రయత్నిస్తే ఒకరోజు మన కష్టానికి తప్పకుండా గుర్తింపు వస్తుంది" అనే సందేశాన్ని తన ప్రయాణం ద్వారా కళ్యాణి రెడ్డి చాటుతున్నారు.
కుటుంబం అండ, పట్టుదల, ప్రతిభ, నిరంతర కృషితో ముందుకు సాగుతున్న నెల్లూరు అమ్మాయి ఎస్. కళ్యాణి రెడ్డి.. భవిష్యత్తులో యాక్టింగ్, మోడలింగ్ రంగాల్లో మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుందాం.

# సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 13:-
చౌదరిగూడ: విద్యార్థినులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండటంతో పాటు రోడ్డు భద్రతా నిబంధనలు పాటిస్తూ, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని చౌదరిగూడ పోలీసులు సూచించారు. చౌదరిగూడ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో గురువారం లాల్‌పహాడ్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులకు సైబర్ నేరాలు, రోడ్డు భద్రత, మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న నేపథ్యంలో సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకులకు స్పందించవద్దని, వ్యక్తిగత వివరాలు, బ్యాంకు సమాచారం, పాస్‌వర్డ్లు, ఓటీపీ వంటి సమాచారాన్ని ఎవరికీ తెలియజేయవద్దని తెలిపారు. సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని సూచించారు.అదేవిధంగా రహదారులపై ప్రయాణించే సమయంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, జాగ్రత్తగా రోడ్డు దాటడం, వాహన ప్రయాణంలో భద్రతా చర్యలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని వివరించారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలను తెలియజేస్తూ వాటికి పూర్తిగా దూరంగా ఉండాలని విద్యార్థినులకు సూచించారు.కార్యక్రమంలో చౌదరిగూడ ఎస్ఐ విజయ్, పోలీస్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థినులు తాము పొందిన అవగాహనను కుటుంబ సభ్యులు, స్నేహితులు, సమాజంలోని ఇతరులకు తెలియజేయాలని పోలీసులు కోరారు.

## నకిలీ సర్టిఫికెట్ల కలకలం.. ఇద్దరు లెక్చరర్లకు షోకాజ్ నోటీసులు!






హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 13:-
ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నకిలీ విద్యార్హత ధ్రువపత్రాల వ్యవహారం కలకలం రేపుతోంది. కళాశాలలో లెక్చరర్లుగా పనిచేస్తున్న సరిత, రవీందర్ సమర్పించిన విద్యార్హత సర్టిఫికెట్లపై అధికారులు అనుమానాలు వ్యక్తం చేసినట్లు ప్రిన్సిపల్ భూపాల్ రాజు తెలిపారు. ఈ నేపథ్యంలో ఇద్దరు లెక్చరర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఆయన వెల్లడించారు. అధికారుల ప్రాథమిక పరిశీలనలో ఒకరు బీహార్‌లోని మగధ్ యూనివర్సిటీకి సంబంధించిన సర్టిఫికెట్‌ను, మరొకరు ఆగ్రాలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీకి సంబంధించిన సర్టిఫికెట్‌ను సమర్పించినట్లు గుర్తించినట్లు ప్రిన్సిపల్ పేర్కొన్నారు. సర్టిఫికెట్ల నిజానిజాలపై అనుమానాలు తలెత్తడంతో పూర్తి స్థాయిలో వివరాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు.
ఇద్దరు లెక్చరర్లు గత మూడేళ్లుగా కళాశాలలో విధులు నిర్వహిస్తున్నారని భూపాల్ రాజు వివరించారు. నోటీసులకు వారం రోజుల్లోగా సంబంధిత లెక్చరర్లు లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. వారి వివరణతో పాటు అందుబాటులో ఉన్న ధ్రువపత్రాలను పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

# ఆరుట్ల పబ్లిక్ పాఠశాలలో ఫుడ్ కమిషన్ తనిఖీ

## మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి: ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి





హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 13:-
మంచాల మండలం ఆరుట్ల గ్రామంలోని తెలంగాణ పబ్లిక్ పాఠశాలను తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, కమిషన్ సభ్యులు ఓరిగంటి ఆనంద్, శారద భారతి గురువారం సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న ఆహార పదార్థాలు, వంటగది, వంట సామగ్రి, భోజనశాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ సుమారు 2,500 మంది విద్యార్థులు చదువుతున్న పాఠశాలలో ఆహార భద్రత నిబంధనలు, నిర్దేశిత మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. నాణ్యమైన ఆహారం అందిస్తున్నప్పటికీ, నిర్ణయించిన మెనూ ప్రకారం అల్పాహారం అందించడం లేదని గుర్తించారు. ఉదయం వేళల్లో విద్యార్థులకు ఇడ్లీ, సాంబార్, దోశ, పూరీ, ఉప్మా, బోండా, చపాతీ, రాగిజావ వంటి అల్పాహారాలను మెనూ ప్రకారం అందించాలని సూచించారు. ప్రతిరోజూ అందించే ఆహార వివరాలను మెనూ బోర్డులో స్పష్టంగా నమోదు చేయడంతో పాటు, రికార్డులను నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రతి నెల వైద్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిబంధనలను ఉల్లంఘించినా, నాణ్యతలో లోపాలు తలెత్తినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సిద్ధగోని గిరిధర్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించి అక్కడి సమస్యలను కమిషన్ సభ్యులు తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మానిపాటి శోభాకుమార్, ఉపసర్పంచ్ నూకం రాజు ముదిరాజ్, తహసీల్దార్ వెంకట ప్రసాద్ రావు, అధికారులు, ఉపాధ్యాయులు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మత్స్యకారుల నైపుణ్యాల గుర్తింపునకు పరీక్షలు



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 13:-
ఇబ్రహీంపట్నం మత్స్యకారుల సహకార సంఘం సభ్యులకు నైపుణ్య పరీక్షలను నిర్వహించినట్లు రంగారెడ్డి జిల్లా ఫిషరీస్ ఇన్‌చార్జ్ ఏడీ ఎం. వెంకయ్య తెలిపారు. మత్స్యకారుల వృత్తిపరమైన సామర్థ్యాలను గుర్తించి, వారికి అవసరమైన అవకాశాలు కల్పించే ప్రక్రియలో భాగంగా ఈ పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. సహకార సంఘంలో మొత్తం 186 మంది సభ్యులు ఉండగా, వారిలో కొత్తగా నమోదైన 94 మంది సభ్యులు పరీక్షలకు హాజరైనట్లు అధికారులు తెలిపారు. అభ్యర్థుల నైపుణ్యాలను వివిధ అంశాల్లో అంచనా వేసేందుకు మొత్తం ఐదు రకాల పరీక్షలను నిర్వహించినట్లు వెంకయ్య వివరించారు. పరీక్షల సందర్భంగా సభ్యులకు అవసరమైన సూచనలు అందించడంతో పాటు, ప్రక్రియను నిబంధనల ప్రకారం కొనసాగించినట్లు చెప్పారు. పరీక్షలకు హాజరైన సభ్యులు క్రమశిక్షణతో వ్యవహరించారని, అధికారులు కూడా సమన్వయంతో ఏర్పాట్లను పర్యవేక్షించారని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పరీక్షలు ప్రశాంత వాతావరణంలో పూర్తయ్యాయని పేర్కొన్నారు. మత్స్యకారుల నైపుణ్యాలను నమోదు చేసి, వారి అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకునేందుకు ఈ పరీక్షలు ఉపయోగపడతాయని అధికారులు తెలిపారు. కార్యక్రమం విజయవంతంగా ముగియడంతో నిర్వాహకులు ఊపిరి పీల్చుకున్నారు.

# చిన్న రావిరాలలో అభివృద్ధి పనులకు శ్రీకారం



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 13:-
ఇబ్రహీంపట్నం: చిన్న రావిరాల గ్రామపంచాయతీ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలు సందడిగా జరిగాయి. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పలు అభివృద్ధి పనులను ప్రారంభించడంతో పాటు కొత్త పనులకు శంకుస్థాపనలు చేశారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్మించిన గృహాలు, ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని లబ్ధిదారులను అభినందించారు. అనంతరం గ్రామంలో పూర్తయిన సీసీ రోడ్లను ప్రారంభించి, మరికొన్ని నూతన సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలకు అవసరమైన సౌకర్యాలను దశలవారీగా అందుబాటులోకి తీసుకువస్తామని మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. అర్హులైన పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల ద్వారా సొంతింటి కలను సాకారం చేసేందుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధితో ప్రజల రాకపోకలకు మరింత సౌలభ్యం కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పబ్బత్ బాలకిషన్ గౌడ్, ఉపసర్పంచ్ సద్దిపల్లి శిరీష శంకర్‌రెడ్డి, వార్డు సభ్యులు బండారి అనిత, మల్లేష్, ఆకిటి రామకృష్ణారెడ్డి, అభవతి బాలయ్య, నారెడ్డి రిషిత, సతీష్‌రెడ్డి, రాపోలు మల్లేష్, బండారి సత్యనారాయణ, చెరుకు భాగ్యలక్ష్మి పాల్గొన్నారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బింగి దేవదాస్ గౌడ్, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, వైస్ చైర్మన్ భాస్కర్ చారి, కళ్లెం శ్రీధర్‌రెడ్డి, కళ్లెం లింగారెడ్డి, చింతల సురేందర్‌రెడ్డి, కడవేరు శ్రీనివాసరావుతో పాటు గ్రామ పెద్దలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల సమ్మేళనం తమ్మలోని గూడ గూడా ప్రాథమిక పాఠశాల



హైదరాబాద్ ఎస్టేట్ యాచారం ప్రతినిధి రామాచారి ఆగస్టు 13
రంగారెడ్డి జిల్లా యాచారం మండలం తమ్మలోనిగూడ గ్రామంలో మండలపరిషత్ ప్రాథమిక/ప్రాథమికోన్నత పాఠశాల 1989-1990 బ్యాచ్ 5వ తరగతి పూర్వ విద్యార్థులు అందరూ ఒక్కటై, చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ తమ పాఠశాల రుణం తీర్చుకోవడం నిజంగా స్ఫూర్తిదాయకం.
ఈ ఆత్మీయ సమ్మేళనం విశేషాలు: పాఠశాలకు విరాళాలు: విద్యార్థుల తాగునీటి అవసరాల కోసం వాటర్ ఫిల్టర్ , పుస్తకాల భద్రత కోసం బుక్ అల్మారా విరాళంగా అందించడం చాలా ఉపయోగకరమైన ఆలోచన.
గురు పూజోత్సవం/సన్మానం: విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను గుర్తుంచుకుని, వారిని ఆత్మీయంగా సన్మానించడం మన సంస్కారానికి నిదర్శనం.
పిల్లలకు భోజన వసతి: పాఠశాల విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేసి, వారిని రేపటి భావి భారత పౌరులుగా కొనియాడడం విశేషం.
స్నేహ బంధం: దశాబ్దాల తర్వాత కూడా ఒకే వేదికపైకి వచ్చి బాల్య జ్ఞాపకాలను నెమరువేసుకోవడం ఎంతో సంతోషాన్నిచ్చే విషయం.
ఈ సత్కార్యాన్ని విజయవంతంగా నిర్వహించిన 1989-1990 పూర్వ విద్యార్థుల బృందానికి, ఉపాధ్యాయులకు మరియు ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక అభినందనలు!
ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మిత్రులు అంజమ్మ, స్వరూప, హరి,ాఖ జాంగిర్ ,కె జంగయ్య ,డి కొండల్ రెడ్డి ,డి వెంకటరమణ ,యస్ జంగయ్య ,ఎ నరెంద్రర్ ,పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు

# ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లకు ముందస్తు పకడ్బందీ ఏర్పాట్లు



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 13:-
ఇబ్రహీంపట్నం: ఖరీఫ్ 202627 సీజన్‌లో రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లను ఎలాంటి ఇబ్బందులు లేకుండా, పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని అదనపు కలెక్టర్ చంద్ర రెడ్డి ఆదేశించారు. గత సీజన్‌లో ఎదురైన సమస్యలు, జాప్యాలు ఈసారి పునరావృతం కాకుండా ముందుగానే అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లపై గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో వివిధ శాఖల అధికారులు, సంబంధిత సంస్థల ప్రతినిధులు, రైస్ మిల్లర్లతో కొనుగోలు ప్రక్రియపై చర్చించారు. ఈ ఖరీఫ్‌లో జిల్లాలోని కొనుగోలు కేంద్రాలకు సుమారు 20 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. రైతుల నుంచి ధాన్యం సేకరణ కోసం 33 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం యంత్రాలు, గన్నీ బ్యాగులు, షెడ్లు, తాగునీరు, విద్యుత్, సిబ్బంది వంటి మౌలిక వసతులను సిద్ధంగా ఉంచాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ధాన్యం కేంద్రాలకు చేరిన వెంటనే నాణ్యత పరీక్షలు నిర్వహించి, తూకం, కొనుగోలు, రవాణా ప్రక్రియలను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. రైతులకు నిబంధనలపై స్పష్టమైన సమాచారం అందించాలని, వారి సమస్యలను వెంటనే పరిష్కరించేలా అధికారులు అందుబాటులో ఉండాలని తెలిపారు. కేంద్రాల వారీగా ధాన్యం రాక, కొనుగోలు, రవాణాను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారులు వనజాత, జిల్లా మేనేజర్ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ రాజ్యంలో మాణిక్యమ్మ గూడా అభివృద్ధి పనులు వేగవంతం - కెఎల్ఆర్

## మాణిక్యమ్మ గూడా గ్రామ శాఖ అధ్యక్షులు లోకేశ్వర్ రెడ్డి



( హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రసన్నది కృష్ణ చారి ఆగస్టు 13:)
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని మాణిక్యమ్మగుడా గ్రామ శాఖ అధ్యక్షులు లోకేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుంది అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి (కెఎల్ఆర్) సహకారంతో గ్రామాభివృద్ధి జరుగుతుందన్నారు. సిసి రోడ్లు 3 ఐమాక్స్ లైట్స్ నేడు అడిగిన వెంటనే ఎస్సీ కాలనీలోని కమ్యూనిటీ హాల్ వద్ద బోరు వేయించడం జరిగింది అలాగే పలు అభివృద్ధి కార్యక్రమాలు కేఎల్ఆర్ సహకారంతో జరుగుతుందని గ్రామ శాఖ అధ్యక్షులు లోకేశ్వర్ రెడ్డి తెలియజేశారు.. యొక్క కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జెన్నపల్లి పద్మకృష్ణ, ఉప సర్పంచ్ డి దయాకర్ రెడ్డి గ్రామ వార్డు సభ్యులు ఏఈ రఘు గ్రామపంచాయతీ కార్యదర్శి భాస్కర్ గ్రామ పెద్దలు నాయకులు యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం జరిగింది

# మండల కేంద్రంలో అత్యధికగా 75 ఇంద్రమ్మ గృహప్రవేశం చేయించిన గంగారం సర్పంచ్ దేవేందర్ నాయక్



( హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి ఆగస్టు 13:)
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని గంగారం గ్రామంలో ఇందిరమ్మ గృహప్రవేశం కార్యక్రమంలో.. పాల్గొన్న గ్రామ సర్పంచ్ దేవేందర్ నాయక్.. మాట్లాడుతూ మండల కేంద్రంలోని అత్యధికంగా 75 ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు చేశామని అన్నారు.. మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జ్ కిచన్న గారి లక్ష్మారెడ్డి చోరోవ తో ప్రతి గ్రామంలో అత్యధికంగా గృహప్రవేశాలు చేశామని అన్నారు.. ఇందిరమ్మ రాజ్యంలో పేదల ప్రజలకు న్యాయం జరుగుతుందని అదేవిధంగా ఇంకా ఎవరైనా ఇందిరమ్మ ఇండ్లు కావాలి అని అనుకుంటే వెంటనే తెలియజేయాలని గ్రామస్థులను కోరారు..
ఈ యొక్క కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తో పాటు దేవేందర్ నాయక్ ఉప సర్పంచ్ మహేందర్ ఎం దేవా ఎం మోహన్ కే రాజు ఎం లావణ్య శ్రీనివాస్ ఎం శ్రీనివాస్ మరి గ్రామ మహిళలు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# జాతీయ జెండాతో 80 కి.మీ. సైకిల్ ర్యాలీ

## డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి.. యువతకు హెడ్ కానిస్టేబుల్ జయరాజు పిలుపు



వరంగల్, ఆగష్టు 13 హైదరాబాద్ ఎస్టేట్:
దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లు పూర్తికానున్న సందర్భంగా కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ జి. జయరాజు 80 కిలోమీటర్ల సైకిల్ ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండాను చేతబూని హనుమకొండ, కాజీపేట, వరంగల్ ప్రాంతాల్లో సైకిల్‌పై పర్యటిస్తూ యువతలో దేశభక్తి, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ర్యాలీ సందర్భంగా మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై యువతకు అవగాహన కల్పిస్తూ డ్రగ్స్‌కు బానిస కావద్దని పిలుపునిచ్చారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడలు, వ్యాయామం, సైక్లింగ్ వంటి ఆరోగ్యకరమైన కార్యకలాపాల వైపు దృష్టి సారించాలని సూచించారు. వరంగల్ ట్రైసిటీ సైకిల్ అసోసియేషన్ సభ్యుడిగా గత ఐదేళ్లుగా కొనసాగుతున్న జయరాజు.. స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా చేపట్టిన ఈ సైకిల్ ర్యాలీతో దేశభక్తితోపాటు మాదకద్రవ్యాల నిర్మూలనపై యువతలో చైతన్యం తీసుకురావడానికి సందేశాన్ని ఇచ్చారు.

RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
14 శుక్రవారం ఆగస్టు 2026

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

### పరకాల తహసీల్దార్‌కు ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ వినతి



పరకాల, ఆగష్టు 13 హైదరాబాద్ ఎస్టేట్:
ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో పరకాల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూపీఎస్‌యూ నాయకులు మెరుగు ప్రసన్న, రావుల రమేష్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పీఆర్సీని 2023 నుంచి అమలు చేయాలని, ఉపాధ్యాయ పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న ఆరు విడతల డీఏలను విడుదల చేయాలని కోరారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రతి రెవెన్యూ డివిజన్‌కు డీఈవో, డీవైఈవో పోస్టులు, నూతన మండలాలకు ఎంఈవో పోస్టులు మంజూరు చేయాలని కోరారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లోని పండిట్, బీఈడీ పోస్టులను అప్‌గ్రేడ్ చేసి పదోన్నతులు కల్పించాలని తెలిపారు. కేజీబీవీ, యూఆర్ఎస్, సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులకు కనీస వేతనం అమలు చేయాలని, సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె కాలపు వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగులకు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా సెలవులు, ఇతర సౌకర్యాలు, ఆరోగ్య కార్డులు కల్పించాలని కోరారు. జీవో 317 కారణంగా స్థానికతను కోల్పోయిన ఉపాధ్యాయులను వారి స్థానిక జిల్లాలకు బదిలీ చేయాలని, అన్ని యాజమాన్యాల ఉపాధ్యాయులకు జీవో 190 అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. మోడల్ స్కూల్, ఎయిడెడ్ పాఠశాలలు, గురుకుల విద్యాసంస్థల సిబ్బందికి 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలని కోరారు. మోడల్ స్కూల్, ఎయిడెడ్ పాఠశాలలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు ఆరోగ్య కార్డులు, పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాజారాం, బిక్షపతి, బాబు, రజియా సుల్తానా, నవీన్, భాగ్యలక్ష్మి, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

## జావిద్‌కు జనగామ ఆర్టీఐ పగ్గాలు

### ప్రజలకు సమాచార హక్కుపై అవగాహన కల్పిస్తా

### మహమ్మద్ జావిద్



జనగామ, ఆగష్టు 13 హైదరాబాద్ ఎస్టేట్:
సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ జనగామ జిల్లా అధ్యక్షుడిగా మహమ్మద్ జావిద్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా అధ్యక్షుడు కాట కుమారస్వామి ఆయనను సన్మానించి అభినందించారు. వరంగల్‌లోని కుమారస్వామి స్వగృహంలో ఈ కార్యక్రమం జరిగింది. జనగామ జిల్లాలో గత ఐదేళ్లుగా కమిటీ ఉపాధ్యక్షుడిగా పనిచేస్తూ ప్రింట్, ఎలక్ట్రానిక్, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజా సమస్యలపై స్పందించిన జావిద్‌కు జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించడం అభినందనీయమని కాట కుమారస్వామి అన్నారు. సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించి, ప్రభుత్వ శాఖల నుంచి అవసరమైన సమాచారాన్ని చట్టబద్ధంగా పొందేలా మార్గనిర్దేశం చేయాలని సూచించారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన కమిటీ నాయకత్వానికి జావిద్ కృతజ్ఞతలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఆర్టీఐ చట్టంపై అవగాహన పెంచి, తమ హక్కులను వినియోగించుకునేలా చైతన్యపరుస్తానన్నారు. జనగామ జిల్లాలో కమిటీని బలోపేతం చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి చట్టబద్ధమైన మార్గంలో కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

## అడ్డగోలు హామీలు & అధికారంలోకి వచ్చాక మాయమాటలు!




హామీలతో గద్దెనెక్కిడ రాష్ట్ర ఆదాయాన్ని దోచుకుంటున్న కాంగ్రెస్!

మాటలు కోటలు దాటాయిడ హామీలు మాత్రం అమలుకు నోచుకోలేదు!

ఎన్నికల ముందు హామీల వర్షం గద్దెనెక్కాక ప్రజలకు కన్నీళ్లు!

హామీలు ఎక్కడ? అమలు ఎక్కడ? కాంగ్రెస్ పాలనపై రవీంద్ర కుమార్ ఫైర్!

ప్రజలను మోసం చేసి అధికారండ హామీలను మరిచి డ్రామాలు!

కాంగ్రెస్ హామీలకు కాలం చెల్లిందా? ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పాలి!

హామీల అమలు మాటే లేదుడ డ్రామాలకు మాత్రం కొదవలేదు!

రాష్ట్ర ఆదాయంపై దోపిడీడ ప్రజా హామీలపై నిర్లక్ష్యం!

హామీలు అమలు చేయండిడ డ్రామాలు ఆపండి!

–దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర

# ఫీజు బకాయిలు విడుదల చేయాలి

### - రూ.10,814 కోట్ల పెండింగ్‌తో 14 లక్షల మంది విద్యార్థుల ఇక్కట్లు..
### - కలెక్టరేట్ ఎదుట ఎస్ఎఫ్ఐ ధర్నా






హనుమకొండ, ఆగష్టు 13 హైదరాబాద్ ఎస్టేట్:
రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామెర కిరణ్, జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్ మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలు ఏళ్లుగా పేరుకుపోవడంతో పేద, మధ్యతరగతి విద్యార్థులు ఉన్నత విద్యను కొనసాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.10,814 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందని, దీంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన సుమారు 14 లక్షల మంది విద్యార్థులు తీవ్రంగా ప్రభావితమవుతున్నారని తెలిపారు. బకాయిలు విడుదల కాకపోవడంతో కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యార్థుల ధ్రువపత్రాలను నిలిపివేస్తున్నాయని నాయకులు ఆరోపించారు. ఫలితంగా విద్యార్థులు చదువు కొనసాగించేందుకు అదనపు ఆర్థిక భారం ఎదుర్కొంటున్నారని అన్నారు. విద్యార్థుల ధ్రువపత్రాలను నిలిపివేసే విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ కళాశాలలు, వసతిగృహాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థుల చదువుకు ఆటంకాలు లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించిన ఎస్ఎఫ్ఐ నాయకులు.. విద్యాశాఖ బాధ్యతలు నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు స్టాలిన్, ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్, సహాయ కార్యదర్శి బిరెడ్డి జశ్వంత్, జిల్లా కమిటీ సభ్యులు బొచ్చు ఈశ్వర్, బొజ్జ హేమంత్, చెన్నూరి సాయికుమార్, పవన్‌కుమార్, సాల్మన్‌రాజు, రాహుల్, రేగుల భానుప్రసాద్, మంద మణిదీప్, రాజ్, కుమార్ ప్రశాంత్, సందీప్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# బీసీ మహిళలకు కుట్టు మిషన్లు

### 119 నియోజకవర్గాల్లో 1,000 చొప్పున పంపిణీ..
### మేర మహిళలకు తొలి ప్రాధాన్యత



హైదరాబాద్, ఆగష్టు 13 హైదరాబాద్ ఎస్టేట్:
బీసీ మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఆటోమేటిక్ కుట్టు మిషన్ల పంపిణీకి శ్రీకారం చుట్టిందని రాష్ట్ర మేర కార్పొరేషన్ చైర్మన్ సంగ వెంకటరాజం తెలిపారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో అర్హులైన బీసీ మహిళలకు ఒక్కో నియోజకవర్గంలో 1,000 చొప్పున కుట్టు మిషన్లు అందించనున్నట్లు చెప్పారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుట్టు వృత్తిని ప్రధాన వృత్తిగా కొనసాగిస్తున్న మేర కులస్తుల మహిళలకు జీవో నంబర్ 2లో తొలి ప్రాధాన్యత కల్పించినట్లు వెంకటరాజం తెలిపారు. ఈ నిర్ణయం మేర మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించడంలో కీలకమన్నారు. పథకానికి అర్హులైన మహిళలు ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 15 వరకు మీ–సేవ కేంద్రాలు లేదా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్, రేషన్ కార్డు తదితర అవసరమైన పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. అర్హులైన మేర మహిళలు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రతి నియోజకవర్గంలో అర్హులైన మేర మహిళలకు పథకం అందేలా ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకుంటామని చెప్పారు. మేర సంఘాల రాష్ట్ర, జిల్లా నాయకులు, కుల పెద్దలు మహిళలకు పథకంపై అవగాహన కల్పించి దరఖాస్తులకు సహకరించాలని కోరారు. మేర మహిళలకు పథకంలో తొలి ప్రాధాన్యత కల్పించాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చామని, తమ విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి, మంత్రికి వెంకటరాజం కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో మేర కార్పొరేషన్ వైస్ చైర్మన్ మాడిశెట్టి లక్ష్మీనారాయణ, మేర సంఘం నాయకులు మునగాల రమేష్, కొత్తకొండ పురుషోత్తం, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# గనుల బిల్లుకు బీఆర్ఎస్ మద్దతు

### రాష్ట్రాల హక్కులు కాపాడాలి..
### సింగరేణికి మరిన్ని గనులు కేటాయించాలి
### ఎంపీ వద్దిరాజు




న్యూఢిల్లీ, ఆగష్టు 13 హైదరాబాద్ ఎస్టేట్:
దేశ పారిశ్రామికాభివృద్ధి, మౌలిక వసతులు, తయారీ రంగం, స్వచ్ఛ ఇంధన సాంకేతికతలకు ఖనిజ సంపద కీలకమని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ ఫ్లోర్ లీడర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. గనులు, ఖనిజాలు (అభివృద్ధి, నియంత్రణ) సవరణ బిల్లు2026కు బీఆర్ఎస్ మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. గురువారం రాజ్యసభలో బిల్లుపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. కీలక ఖనిజాలు, అరుదైన భూలోహాలు, వ్యూహాత్మక ఖనిజాలకు భవిష్యత్తులో డిమాండ్ మరింత పెరగనుందని రవిచంద్ర పేర్కొన్నారు. గనుల రంగంలో పన్నులు, సెస్‌లు, ఇతర రుసుముల విధానంలో స్పష్టత, ఏకరూపత తీసుకురావడం బిల్లు ప్రధాన ఉద్దేశమని తెలిపారు. పెట్టుబడులకు అనుకూల వాతావరణం కోసం పారదర్శక, స్థిరమైన విధానం అవసరమన్నారు. అయితే ఖనిజ వనరులు కలిగిన రాష్ట్రాల ఆర్థిక హక్కులు, సమాఖ్య స్ఫూర్తిని పరిరక్షిస్తూ సంస్కరణలు అమలు చేయాలని సూచించారు. గనుల తవ్వకాల వల్ల పర్యావరణ పరిరక్షణ, పునరావాసం, సామాజిక బాధ్యతల భారాన్ని రాష్ట్రాలు కూడా మోస్తున్నందున వాటి ఆదాయ హక్కులు, అభివృద్ధి అవసరాలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. తాడిచర్ల బొగ్గు గనిని సింగరేణి సంస్థకు అప్పగించడంపై రవిచంద్ర హర్షం వ్యక్తం చేశారు. సభలో ఉన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కోయగూడెం, మణుగూరు, శ్రావణపల్లి గనులను కూడా సింగరేణికి కేటాయించాలని కోరారు. దీంతో వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. ఖనిజాలను వెలికితీయడంతోపాటు వాటి ఆధారంగా దేశీయ విలువ ఆధారిత పరిశ్రమలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. శాస్త్రీయ ఖనిజ అన్వేషణ, పర్యావరణహిత తవ్వకాలు, డిజిటల్ పర్యవేక్షణ, పారదర్శక పరిపాలనపై దృష్టి పెట్టాలని సూచించారు. తెలంగాణలో గత ప్రభుత్వం ఖనిజ వనరుల నిర్వహణ, గనుల అనుమతుల ప్రక్రియ సరళీకరణ, ఖనిజ ఆధారిత పరిశ్రమల ప్రోత్సాహానికి చర్యలు చేపట్టిందని రవిచంద్ర తెలిపారు. పెట్టుబడుల ప్రోత్సాహం, పర్యావరణ పరిరక్షణ, రాష్ట్రాల హక్కుల మధ్య సమతుల్యత కొనసాగించాలన్న ఉద్దేశంతోనే బిల్లుకు బీఆర్ఎస్ మద్దతు ఇస్తోందని స్పష్టం చేశారు.

## అమరావతి ప్రాజెక్టుల ప్రారంభోత్సవానికి పవన్‌ను ఆహ్వానించిన మంత్రి నారాయణ



రాజధాని అమరావతిలో త్వరలో ప్రారంభం కానున్న పలు కీలక ప్రాజెక్టుల ప్రారంభోత్సవానికి హాజరుకావాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను ఆహ్వానించారు. బుధవారం పవన్ కల్యాణ్‌తో భేటీ అయిన మంత్రి, రాజధానిలో పూర్తి కావచ్చిన వివిధ అభివృద్ధి పనుల పురోగతిని ఆయనకు వివరించారు. అమరావతిలో నిర్మాణం పూర్తి చేసుకున్న సీడ్ యాక్సెస్ రోడ్డుతో పాటు, రెండు స్టీల్ బ్రిడ్జిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కోసం నిర్మించిన గృహ సముదాయాలను ప్రారంభించాల్సిందిగా ఉప ముఖ్యమంత్రిని నారాయణ కోరారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాజధాని పనులు శరవేగంగా జరుగుతున్నాయని, సీడ్ యాక్సెస్ రోడ్డు అమరావతి అభివృద్ధికి మరింత ఊతమిస్తుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. మరోవైపు, విశాఖపట్నంలో రాష్ట్ర అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి 'ప్రపంచ ఏనుగుల దినోత్సవ' వేడుకలకు సైతం ఉప ముఖ్యమంత్రి హాజరుకానున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు. ఈ కార్యక్రమానికి కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ కూడా ముఖ్య అతిథిగా విచ్చేయనున్నారని ఆయన వెల్లడించారు. రాజధాని అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణకు తమ ప్రభుత్వం సమాన ప్రాధాన్యతనిస్తోందని, రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ప్రగతి పథంలో నడిపించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి నారాయణ స్పష్టం చేశారు.

# సేవాలాల్ జయంతి నిధులపై లెక్కలు తేల్చాలి

## ఆర్టీఐ అప్పీల్‌పై సమాచార కమిషన్‌లో విచారణ

గీసుగొండ, ఆగష్టు 13 హైదరాబాద్ ఎస్టేట్:
సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి కార్యక్రమాలకు విడుదలైన ప్రజా నిధులు, వాటి ఖర్చులు, బిల్లులు, వౌచర్లు, వినియోగ ధ్రువపత్రాలు, చెల్లింపు వివరాలు వెల్లడించాలని కోరుతూ రేవంత్ రాథోడ్ దాఖలు చేసిన సమాచార హక్కు అప్పీల్‌పై బుధవారం తెలంగాణ సమాచార కమిషన్‌లో విచారణ జరిగింది. అప్పీల్ నంబర్ 12253/ఎస్ఐసి-ఎంపీ/2026పై విచారణ చేపట్టిన కమిషన్.. కోరిన సమాచారాన్ని సంబంధిత ప్రజా సమాచార అధికారి ద్వారా అందించేలా ఆదేశాలు జారీ చేసినట్లు రేవంత్ రాథోడ్ తెలిపారు. సేవాలాల్ జయంతి కార్యక్రమాలకు సంబంధించి గత ఎనిమిదేళ్లలో విడుదలైన నిధులు, పరకాల నియోజకవర్గానికి సంబంధించిన నిధులు, సంవత్సరాల వారీగా చేసిన ఖర్చులు, గిరిజన సంక్షేమ పథకాల ద్వారా విడుదలైన నిధుల వివరాలను ఆయన కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. నిధుల వినియోగానికి సంబంధించిన పూర్తి ఆధార పత్రాలను అందించాలని కోరారు.

రూ.3.32 లక్షల ఖర్చుపై రికార్డులు కోరుతూ..

2025లో రూ.3.32 లక్షలు ఖర్చు చేసినట్లు ప్రజా సమాచార అధికారి సమాధానంలో పేర్కొన్నప్పటికీ.. ఆ ఖర్చుకు సంబంధించిన బిల్లులు, వౌచర్లు, వినియోగ ధ్రువపత్రం, చెల్లింపు వివరాలు, మంజూరు ఉత్తర్వులు, దస్త్రంలోని గమనికలు తదితర ఆధార పత్రాలు అందలేదని రేవంత్ రాథోడ్ కమిషన్‌కు వివరించారు. పరకాల ఆర్డీవో ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించినట్లు, బిల్లులు సమర్పించినట్లు సమాధానంలో పేర్కొన్న అంశాన్ని కూడా ప్రస్తావించారు. 2026లో రూ.3.32 లక్షలు విడుదలైనట్లు చూపిస్తూ ఖర్చు శూన్యంగా, అదే మొత్తం నిల్వగా చూపించారని తెలిపారు. 'బిల్లులు ఇంకా సమర్పించలేదు' అని పేర్కొన్నందున ప్రస్తుతం బిల్లుల పరిస్థితి ఏమిటి, అనంతరం బిల్లులు సమర్పించి ఉంటే వాటికి సంబంధించిన పూర్తి వివరాలు, ఆధార పత్రాలు అందించాలని కోరారు. గత ఎనిమిదేళ్లకు సంబంధించిన సంవత్సరాల వారీ నిధుల వివరాలు, పరకాల నియోజకవర్గానికి సంబంధించిన కేటాయింపులు, అంశాల వారీ ఖర్చులు, బిల్లులు, వౌచర్లు, వినియోగ ధ్రువపత్రాలు, లెక్కల సరిపోలింపు పత్రాలు, మంజూరు ఉత్తర్వులు, చెల్లింపు రికార్డులతో పాటు కార్యక్రమానికి సంబంధించిన అందుబాటులో ఉన్న అధికారిక దస్త్రాలను అందించాలని రేవంత్ రాథోడ్ కోరారు. పూర్తి దస్త్రాన్ని పరిశీలించే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. విచారణలో రేవంత్ రాథోడ్ కోరిన సమాచారాన్ని పరిశీలించిన సమాచార కమిషన్.. సంబంధిత ప్రజా సమాచార అధికారి ద్వారా పూర్తి వివరాలను వీలైనంత త్వరగా అందించేలా ఆదేశాలు




జారీ చేసినట్లు ఆయన తెలిపారు. బిల్లులు, వౌచర్లు, ఇతర ఆధార పత్రాలను కూడా సకాలంలో అందించాలని కమిషన్ స్పష్టం చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ రాథోడ్ మాట్లాడుతూ ప్రజలు తమకు సంబంధించిన ప్రభుత్వ సమాచారాన్ని సమాచార హక్కు చట్టం ద్వారా తెలుసుకోవాలని సూచించారు. ప్రజలు కోరిన సమాచారాన్ని తొలిదశలోనే పూర్తి స్థాయిలో అందిస్తే తదుపరి అప్పీళ్ల అవసరం ఉండదన్నారు. ప్రజా నిధుల వినియోగంలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని పేర్కొన్నారు. ప్రజా నిధులు, ప్రభుత్వ దస్త్రాలకు సంబంధించిన సమాచారాన్ని సమాచార హక్కు చట్టం ద్వారా తెలుసుకునే ప్రయత్నాలు కొనసాగిస్తానని తెలిపారు.

# బొంరాస్‌పేట్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, IPS గారు





హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి
వికారాబాద్
వికారాబాద్ జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, IPS గారు ఈ రోజు బొంరాస్‌పేట్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని పలు విభాగాలను పరిశీలించి, శాంతిభద్రతలు, నేర నియంత్రణ, కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసులు, స్టేషన్ రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. అనంతరం నూతనంగా ఏర్పాటు అవుతున్న బొంరాస్‌పేట్ పోలీస్ స్టేషన్ భవనాన్ని ఎస్పీ గారు పరిశీలించారు. భవన నిర్మాణ పనుల పురోగతిని, పోలీస్ సిబ్బందికి మరియు ప్రజలకు అందుబాటులో ఉండే సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ నీతి, నిజాయితీ, నిబద్ధత, క్రమశిక్షణతో విధులు నిర్వర్తించడం ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజల పట్ల మర్యాదగా, బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, ప్రతి ఫిర్యాదుపై సత్వర స్పందన అందించాలని సూచించారు. పోలీస్ శాఖపై ప్రజలకు మరింత నమ్మకం కలిగేలా పోలీసింగ్ కొనసాగించాలని తెలిపారు. నేరాల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలని, పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి నాణ్యమైన దర్యాప్తుతో కేసులను పరిష్కరించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో పెట్రోలింగ్‌ను మరింత పటిష్టం చేసి, అసాంఘిక కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. మహిళలు, చిన్నారుల భద్రతతో పాటు సైబర్, NDPS నేరాల నియంత్రణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ప్రజల భద్రత, నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ సిబ్బంది సమిష్టిగా పనిచేయాలని, విధి నిర్వహణలో అప్రమత్తత, క్రమశిక్షణ, నిబద్ధతను ఎల్లప్పుడూ పాటించాలని ఎస్పీ గారు సూచించారు. ఈ కార్యక్రమంలో పరిగి డీఎస్పీ శ్రీనివాస్, పరిగి సీఐ శ్రీ కొండల్ రెడ్డి, బొంరాస్‌పేట్ ఎస్ఐ, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దళిత మహిళ ఆత్మగౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలు అమానుషం

### - మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దళితులకు, మహిళకు బహిరంగ క్షమాపణ చెప్పాలి

### - రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) రాష్ట్ర అధ్యక్షులు డా. పిట్టా వరప్రసాద్ డిమాండ్

కాకినాడ, ఆగస్టు 13, 2026:
ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షపై నమోదు చేసిన ఎస్సీ/ఎస్టీ (అత్యాచారాల నిరోధక) చట్టం కేసు నెం. 38/2026 నేపథ్యంలో, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈరోజు కర్నూలు జైలుకు వెళ్లి విరూపాక్షను పరామర్శించి, అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో చేసిన వ్యాఖ్యలు దళితుల ఆత్మగౌరవాన్ని, ముఖ్యంగా ఒక దళిత మహిళ ఆత్మగౌరవాన్ని తీవ్రంగా కించపరిచే విధంగా ఉన్నాయని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు డా. పిట్టా వరప్రసాద్ తీవ్రంగా ఖండించారు. ఒక దళిత మహిళ, ఆమె భర్తను ఉద్దేశించి అత్యంత అవమానకరమైన రీతిలో జరిగినట్లు చెబుతున్న సంఘటనను ప్రస్తావిస్తూ, బాధితులపై జరిగిన అవమానాన్ని మరింత అవమానకరంగా చిత్రీకరించడం సమంజసం కాదని ఆయన అన్నారు. నిజానిజాలు దర్యాప్తులో తేలాల్సిన విషయం; కానీ ఒక మహిళ గౌరవాన్ని, దళితుల ఆత్మగౌరవాన్ని రాజకీయ విమర్శలకు సాధనంగా ఉపయోగించడం మాత్రం తీవ్రంగా అభ్యంతరకరం అని పేర్కొన్నారు. SC/ST అత్యాచారాల నిరోధక చట్టం ఉద్దేశం దళితులు, ఆదివాసీలపై జరిగే అవమానాలు, దాడులు, వివక్షను అరికట్టి వారికి చట్టపరమైన రక్షణ కల్పించడమేనని ఆయన గుర్తుచేశారు. ఈ చట్టం కింద కేసు నమోదైన సందర్భంలో రాజకీయ నాయకులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సి ఉంటుందని అన్నారు.
"ఒక దళిత మహిళ గౌరవం రాజకీయాలకు అతీతమైనది. ఆమెను అవమానించేలా మాట్లాడటం లేదా ఆమెపై జరిగినట్లు ఆరోపణలు ఉన్న సంఘటనను తేలికగా తీసుకోవడం ఏ రాజకీయ నాయకుడికీ తగదు. దళితుల ఆత్మగౌరవం, మహిళల గౌరవం విషయంలో ఎలాంటి రాజకీయ పార్టీ అయినా బాధ్యతతో వ్యవహరించాలి" అని డా. పిట్టా వరప్రసాద్ అన్నారు. అదేవిధంగా, కేసులోని ఆరోపణలు నిజమా కాదా అన్నది నిష్పక్షపాత దర్యాప్తు, సాక్ష్యాలు మరియు న్యాయస్థాన విచారణ ద్వారా మాత్రమే తేలాలని, రాజకీయ వేదికలపై ముందుగానే తీర్పులు ఇవ్వడం సరికాదని ఆయన అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు దళిత సమాజంలో తీవ్ర ఆవేదన కలిగించే విధంగా ఉన్నందున, ఆయన వెంటనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని, దళితులకు మరియు సంబంధిత మహిళకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డా. పిట్టా వరప్రసాద్ డిమాండ్



చేశారు. దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు, మహిళల గౌరవాన్ని పరిరక్షించేందుకు, ఎస్సీ/ఎస్టీ చట్టాల అమలులో ఎలాంటి రాజకీయ జోక్యం లేకుండా నిష్పక్షపాత దర్యాప్తు జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

డా. పిట్టా వరప్రసాద్
రాష్ట్ర అధ్యక్షులు
రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్),
ఆంధ్రప్రదేశ్

# సాగునీటి ప్రాజెక్టులు, చెరువుల నీటి నిల్వలపై సమగ్ర నివేదిక అందించాలి

### - జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ,



సాగునీటి ప్రాజెక్టులు, చెరువుల నీటి నిల్వలపై సమగ్ర నివేదిక అందించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం ఐడిఓసి కార్యాలయంలో ఇరిగేషన్, మిషన్ భగీరథవ్యవసాయ శాఖలతో నీటి లభ్యత, పంటల సాగుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, మైనర్ ఇరిగేషన్ చెరువుల్లో నీటి నిల్వలు, మంచినీటికి నీటి నిల్వలు, ఆయకట్టు పరిధిలోని సాగునీటి అవసరాలపై సమగ్ర నివేదికలు అందచేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల వారీగా ప్రస్తుత నీటి నిల్వలు, ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో, ఆయకట్టు పరిధి, రైతుల అవసరాలు తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డు సమావేశం నిర్వహించి, నీటి లభ్యత, భవిష్యత్ అవసరాలను పరిగణనలోకి తీసుకుని రైతులకు సాగునీటి వినియోగంపై తగిన మార్గదర్శకాలు అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఇరిగేషన్, మిషన్ భగీరథ, వ్యవసాయ, ఉద్యాన వన శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.








